హఫీజ్‌పేట్‌కు 'అమృత్' శోభ

● చకచకా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు
● రూ.26.6 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలు

హఫీజ్‌పేట్ : అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్‌లను ఆధునీకరించే దిశగా ప్రయాణికులకు సకల సౌకర్యాలను కల్పించనుంది. ఈ క్రమంలో హఫీజ్ పేట్ రైల్వేస్టేషన్‌ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దనుంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఐటీ అభివృద్ధి శరవేగంగా దూసుకెళ్తుంది. హైదరాబాద్ నగరానికి ఇతర రాష్ట్రాల ప్రజలు వచ్చి స్థిరపడుతుండడంతో రాకపోకలు పెరిగాయి. ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హఫీజ్‌పేట్, హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్‌ల పునరుద్ధరణ పనులకు 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' కింద శ్రీకారం చుట్టాయి.

- రూ.26.6 కోట్లతో రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి.
- ప్రయాణికులకు పలు సౌకర్యాలతో పాటు హోటల్స్, మాల్స్ ఏర్పాటుతో ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నారు.
- రైల్వేస్టేషన్ రైల్వే ప్రాంగణంలో లైటింగ్ వ్యవస్థ, ఎస్కలేటర్లు, రైల్‌ఓవర్ బ్రిడ్జి, దివ్యాంగులకు కనీస వసతులు, ఉచితంగా వైఫై అందించనున్నారు.
- గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ స్టేషన్ ప్రాంగణంలో గ్రీనరీని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు.
- రైల్వే స్టేషన్‌ను సిటీ సెంట్రల్‌గా అభివృద్ధి చేస్తూ అబ్బురపరిచే రీతిలో రైల్వే భవనం, ట్రాఫిక్ సర్క్యులేషన్, ఇంటర్ మోడల్ ఇంటిగ్రేషన్, ప్రయాణికులకు మార్గనిర్దేశం కొరకు సంకేతాలు, ల్యాండ్ స్కేపింగ్, కళ, సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు.
- రైల్వే ప్రయాణికులకు స్పష్టమైన ఎల్ఈడీ ఆధారిత సూచిక బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయనున్నారు.
- సాంకేతిక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.



హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు







హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ నమూనా చిత్రం

అభివృద్ధి అవసరం



అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద రూ.26 కోట్లతో హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయడం ఆనందంగా ఉంది. మియాపూర్, హఫీజ్ పేట్, మదీనాగూడ ప్రజలకు రైలు ప్రయాణం సులువుగా ఉంటుంది. స్టేషన్ అభివృద్ధి చెందితే లోకల్‌గా గ్రోత్ ఉంటుంది.

–మహేష్ యాదవ్, హఫీజ్‌పేట్

ప్రయాణికుల రాకపోకలు పెరుగుతాయి



హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ అభివృద్ధితో లోకల్, దూర ప్రాంత ప్రయాణికుల రాకపోకలు పెరుగుతాయి. ఇప్పటికే వారాంతపు రోజులలో స్టేషన్ కిక్కిరిసి పోతుంది.ఇక అభివృద్ధి చేస్తే రానున్న రోజుల్లో ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడం సంతోషం.

–మనోజ్, హఫీజ్‌పేట్

దేశవ్యాప్త సమ్మె కరపత్రాల ఆవిష్కరణ



ఎంఏనగర్‌లో కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐసీసీటీయూ నాయకులు

మియాపూర్: ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐసీసీటీయూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ కార్యదర్శి కర్ర దానయ్య పిలుపునిచ్చారు. మియాపూర్‌లోని ఎంఏనగర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి కరపత్రాన్ని కార్మిక నాయకులతో కలిసి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ సంఘటిత, అసంఘటిత కార్మికులను రోడ్డు పాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రమేష్, రాంబాబు, తుకారాంనాయక్, రవి, శివాని, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డును తరలించాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంప్ యార్డుతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, ఈ డంప్‌యార్డును ఇక్కడి నుంచి తరలించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహ్మకు వినతిపత్రాన్ని అందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు నర్సింగ్‌రావు, మాజీ అధ్యక్షులు మద్ది వీరారెడ్డి, ఎంపీటీసీలు నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నీలమ్మలు మంత్రికి సమస్యలను వివరించారు. మంత్రి స్పందించి కలెక్టర్‌కు ఫోన్ చేసి డంప్ యార్డు నిర్మాణ పనులను వెంటనే ఆపాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు.

సరోజినీనాయుడిని ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని తపస్వీ ఫౌండేషన్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరోజినీనాయుడు జయంత్యోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ మహిళా సాధికారతకు కృషి చేశారన్నారు. నేటి మహిళలు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఉమా చంద్రశేఖర్, మల్లేష్, పాలం శ్రీను, అమ్మయ్య చౌదరి, చప్పిడి కృష్ణ యాదవ్, ఆశ్రమ నిర్వాహకురాలు శాంతి తదితరులు పాల్గొన్నారు.

'ఫారెస్ట్ లిట్టర్ కంపోస్ట్'పై మరిన్ని పరిశోధనలు చేయాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారితో విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్, వాణీప్రసాద్ తదితరులు

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్

గచ్చిబౌలి: దేశంలో ఫారెస్ట్ లిట్టర్ కంపోస్ట్ ఉపయోగించడంపై మరిన్ని పరిశోధనలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ)లో డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్ అధ్యక్షతన 'అటవీరంగంలో వాతావరణ స్థితిస్థాపకతను నిర్మించడం, కార్బన్ క్రెడిట్స్, కార్బన్ ట్రేడింగ్, గ్రీన్ క్రెడిట్' అనే అంశంపై మంగళవారం వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మట్టి సూక్ష్మజీవుల ద్వారా కార్బన్ సీక్వెస్ట్రేషన్స్‌కు సహాయం చేయడానికి ఫారెస్ట్ లిట్టర్ కంపోస్ట్ వినియోగం మరింత పెరగాల్సిన అవసరముందన్నారు రాష్ట్రంలో పచ్చదనం కొనసాగించడం, హరిత సంపదను సంరక్షించడానికి కార్బన్ క్రెడిట్, కార్బన్ ట్రేడింగ్ ద్వారా ప్రయోజనాలను పెంచే మార్గాలను గుర్తించడానికి మార్గాలను పరిశోధించిందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ప్రభాకర్, డాక్టర్ శేష శ్రీనివాస్, సీనియర్ సైంటిస్ట్ ప్రణబ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో బయో అన్వేషణ-2024

ఈనెల 15 నుంచి 18 వరకు నిర్వహణ

రాయదుర్గం: ప్రతిష్టాత్మకమైన బయోఅన్వేషణ-2024ను నిర్వహణకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వేదికకానుంది. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బయో అన్వేషణ్ అనేది జీవశాస్త్రం యొక్క రహస్యాలను అన్వేషించడంలో మానవాళికి ఉపయోగపడే సాంకేతికతలోని అంశాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమాలు సాగుతాయి. పలువురు శాస్త్రవేత్తలు, బయోటెక్నాలజీ రంగంలోని నిపుణులను భాగస్వాములను చేస్తారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ రాజేష్ గోఖలే, ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, నోబెల్ గ్రహీత రిచర్డ్ జే రాబర్ట్స్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

18న మహర్షిదయానంద సరస్వతి జయంతి

రాయదుర్గం: ఆర్యసమాజ్ సంస్థాపకుడు మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి ఉత్సవాలను ఈ నెల 18న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు, తెలుగు రాష్ట్రాల ఆర్యసమాజ్ ప్రతినిధి డాక్టర్ ధర్మతేజ వెల్లడించారు. ఈ మేరకు వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 గంటలకు శోభాయాత్ర కూడా ఉంటుందన్నారు. ఒక ప్రచార రథాన్ని తయారుచేసి ఉభయ రాష్ట్రాలలోని అన్ని గ్రామాలలో మహర్షి దయానందుని బోధనలను, ప్రదేశాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

తరలిన బీఆర్ఎస్ నేతలు

గచ్చిబౌలి/రాయదుర్గం: నల్గొండలో బీఆర్ఎస్ పార్టీ సమావేశానికి శేరిలింగంపల్లి నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ నాయకత్వంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, హమీద్‌పటేల్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, శ్రీకాంత్, మంజులా రఘునాథ్‌రెడ్డి, రోజాదేవి, సింధూ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు



ఎస్ వైష్ణవి 95.62



శ్రీజ 92.29



సాయిరామ్ 99.46



వెంకటేష్ 99.31

రాయదుర్గం: జేఈఈ మెయిన్స్ ఫేజ్-1లో గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు తమ సత్తా చాటారు. కళాశాల ప్రిన్సిపల్ శారద మంగళవారం మాట్లాడుతూ 108 మంది సెకండ్ ఇయర్ ఎంపీసీ విద్యార్థులు పరీక్ష రాశారని అందులో 90 పర్సంటైల్‌పైన ఏడు మంది విద్యార్థులు సాధించారని వివరించారు. అంతేకాకుండా 80 పర్సంటైల్..25 మంది అని, 50 పర్సంటైల్..80 మంది విద్యార్థులు సాధించారని వివరించారు. ఎస్ వైష్ణవి 95.62 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచారన్నారు. బి భార్గవి 93.07, ఆర్ శృతిక 92.87, టి శ్రీజ 92.29, యూ ప్రియాంజలి 92.15, ఎల్ శుభశ్రావ్య 91.28, పి కృష్ణవేణి 91.28 పర్సంటైల్ సాధించి కళాశాలలో టాపర్లుగా నిలిచారని ఆమె వివరించారు.

- అలాగే గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర ఐఐటీ, నీట్ అకాడమీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపల్ పాపారావు తెలిపారు. కళాశాల నుంచి 22 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ పైగా సాధించారన్నారు.



స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

స్వయంపాలన దినోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తోట భాస్కర్ మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులుగా విద్యార్థి సుభాష్, మండల విద్యాధికారిగా అంజలి, జిల్లా విద్యాధికారిగా మీనా, కలెక్టర్‌గా కళ్యాణి, విద్యాశాఖ మంత్రిగా అయేషా ఫాతిమా, ఎమ్మెల్యేగా సంతోష్‌కుమార్ వారి ప్రతిభను చాటారు. ఉపాధ్యాయులుగా దీక్షిత, భాగ్యశ్రీ , జ్యోతిప్రభ, సతీష్, హరీష్,ఈశ్వర్, అటెండర్లుగా రాంచరణ్, నరేష్‌లు వ్యవహరించారు.

ప్రపంచభాషల్ని తనలో కలుపుకోగలిగే శక్తి తెలుగుకే ఉంది



డాక్టర్ మేడసాని మోహన్‌ను సన్మానించిన మానవీయ శాస్త్రాల డీన్ కృష్ణ

మహాసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్

రాయదుర్గం: ప్రపంచంలోని అనేక భాషలను తనలో కలుపుకోగలిగే సహజత్వాన్ని కోల్పోని మహత్తర శక్తి తెలుగు భాష సొంతమని మహాసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మానవీయ శాస్త్రాల ఆడిటోరియంలో 'వెయ్యేళ్ల తెలుగు పద్య సాహిత్య వైభవం' అనే అంశంపై తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ తెలుగు ద్రావిడ భాషా జన్యమే అయినా, అధికంగా సంస్కృత ప్రభావం ఉందని, దాని వల్ల వేద సంస్కృతి తెలుగుభాషలో కనిపిస్తుందని చెప్పారు. మానవుల మనస్తత్వం ఆంధ్ర మహాభారతంలో ఉందని, దానిని నన్నయ ఎంతో పరిశీలనతో వివిధ పాత్రల రూపంలో సృజనీకరించారన్నారు. మానవీయ శాస్త్రాల విభాగం డీన్ కృష్ణ మాట్లాడుతూ ఇతర భాషలతో పోలిస్తే తెలుగుకు గొప్ప రమణీయత, ఇతర భాషల్లో లేని అనేక ప్రక్రియలు ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఆచార్యులు పిల్లలమర్రి రాములు, గోనానాయక్, పమ్మి పవన్ కుమార్, విజయలక్ష్మి, ,వారాజారాణి, భూక్యా తిరుపతి,బాణాల భుజంగరెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఫెలిసిటీ ఐఐఐటీ హెచ్- 2024'







రాయదుర్గం: చదువులోనే కాదు పెయింటింగ్‌లోనూ ప్రతిభ చాటారు గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు. ట్రిపుల్‌ఐటీలో టెక్నో-సాంస్కృతిక వేడుకను 'ఫెలిసిటీ ఐఐఐటీ హెచ్ 2024' పేరిట ఇటీవల నిర్వహించిన కార్యకమంలో భాగంగా ట్రిపుల్‌ఐటీ ఆర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'వాల్ పెయింటింగ్' పోటీలను నిర్వహించారు. ఆకట్టుకునే, ఆలోచింపజేసే తరహా చిత్రాలతో విద్యార్థులు క్యాంపస్‌లోని హాస్టల్, క్యాంటిన్, ప్రహరీ గోడలపై పెయింటింగ్ చేశారు. ఈ చిత్రాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.









ముగిసిన ఎన్ఈపీ-2020 ఓరియంటేషన్

రాయదుర్గం: మనూలో నాల్గవ జాతీయ విద్యావిధానం-2020పై ఓరియంటేషన్, సెన్సిటైజేషన్ కార్యక్రమం మంగళవారం ముగిసింది. గచ్చిబౌలిలోని యూజీసీ-మాలవ్య మిషన్ టీచర్స్ ట్రెనింగ్ సెంటర్(ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెలా రెండుసార్లు ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 128 మంది పాల్గొన్నారు. ముఖ్యంగా అందరికీ సంపూర్ణ విద్య, శిక్షణ అందించడం, భారతదేశం కేంద్రీకృత నైతికత,బహుళ క్రమశిక్షణ, విద్య, భారతీయవిజ్ఞాన వ్యవస్థలు, విద్యా నాయకత్వ పాలన, నిర్వహణ, ఉన్నత విద్య, సమాజం, పరిశోధన, అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి తదితరాలపై ఫ్యాకల్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నాలా కల్వర్టు పనులు ప్రారంభం



అమీన్‌పూర్ రోడ్డులో జరుగుతున్న కల్వర్టు పనులు

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు చేపడుతున్న 150 ఫీట్ల రోడ్డు విస్తరణలో భాగంగా నాలా కల్వర్టు పనులు మంగళవారం ప్రారంభం అయ్యాయి. కోటి రూపాయలతో సుమారు 6 మీటర్ల వెడల్పుతో పాటు 100 మీటర్ల వరకు విస్తరణ చేపడుతున్నామని కాంట్రాక్టర్ తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

డ్రంకన్ డ్రైవ్.. జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 8 మందికి ఒక్కొక్కరికీ రూ. 10 వేల జరిమాన విధించగా, మరో ఇద్దరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

భాగ్యనగర్‌కాలనీ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సిఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా మండపేట కేశవాపురానికి చెందిన తమ్మనపూడి భువన్ (24) అడ్డగుట్ట సొసైటీలో ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. భువన్ తండ్రి చనిపోవంతో తల్లి ఆరోగ్యం బాగా లేకపోవటంతో వచ్చిన జీతంతో తల్లికి చికిత్స చేయిస్తున్నాడు. జీతం సరిపోకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మనస్థాపానికి గురైన భువన్ హాస్టల్‌లోని ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేసిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారానికి చెందిన చాకలి రాజు భార్య మానస(26) జనవరి 9వ తేదీ ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. గతంలో కూడా మానస ఇంటి నుండి వెళ్లిపోయి మరలా వచ్చినట్లు భర్త పోలీసులకు తెలిపాడు.భర్త రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్..రిమాండ్

మియాపూర్ : నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మయూరినగర్‌లోని సెవెన్ హిల్స్‌బార్ సమీపంలో తనిఖీలు చేస్తుండగా ఆ ప్రదేశంలో సంచరిస్తున్న సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారానికి చెందిన పద్మలోచన్ (27)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద ఎండు గంజాయి, గంజాయి చాక్లెట్‌లను గుర్తించారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఒడిశా రాష్ట్రంలో గత నెల 25వ తేదీ ఓ వ్యక్తి నుండి గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చారు. స్థానికంగా మియాపూర్‌లోని భవన నిర్మాణ స్థలాలు, లేబర్ అడ్డాలు తదితర ప్రదేశాల్లో ఎండు గంజాయి, గంజాయి చాక్లెట్‌లను విక్రయిస్తున్నట్లు తెలిపారు.అతని వద్ద నుండి 1.5 కేజీ ఎండు గంజాయి, 25 గంజాయి చాక్లెట్‌లు (160గ్రాములు), మొబైల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తల్లీ, ఇద్దరు పిల్లలు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తల్లీ, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కొండాపూర్ రాఘవేంద్ర కాలనీకి చెందిన ఈశ్వరమ్మ కూతురు హరితకు బీరంగూడకు చెందిన మిథున్‌బాబుతో వివాహం జరిగింది. మిథున్‌బాబు భార్య ఇద్దరు పిల్లలతో కలిసి జగద్గిరిగుట్ట ఎల్లమ్మబండ వద్ద ఉంటూ, ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. కాగా జనవరి ఒకటో తేదీన భార్యతో గొడవపడిన మిథున్‌బాబు బీరంగూడలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. తదనంతరం ఫిబ్రవరి 12వ తేదీన హరిత ఇద్దరు పిల్లలు ధనుషిక(2) తియాన్(6) లను తీసుకొని బీరంగూడ భర్త వద్దకు వచ్చింది. తిరిగి 13వ తేదీ ఉదయం ఇద్దరు పిల్లలని తీసుకొని వెళ్లిపోయింది. దీంతో హరిత, పిల్లల కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కూతురు హరిత అదృశ్యంపై తల్లి ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో.. యువతి

మియాపూర్ : ఇంటి నుండి బయటకు వెళ్లిన యువతి మరలా తిరిగిరాని సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన మినూచౌదరి హాఫీజ్‌పేటలో నివాసముంటూ స్థానికంగా కూలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు.మినూ చౌదరి రెండవ కూతురు తుక్తూల్‌లాల్ సర్కార్(26) గత నెల 27వ తేదీ తండ్రి మినూ చౌదరి ఇంటికి వచ్చింది. 30వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో నుండి బయటకు వెళ్లి రాత్రి అయిన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తండ్రి చౌదరి కుటుంబ సభ్యులు చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్లల్లో వాకబు చేశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో చౌదరి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.